# తెలంగాణలో కాంగ్రెస్ భూస్థాపితమే

- రాష్ట్రంలో పార్టీ పూర్తిగా భ్రష్టుపట్టింది
- రూ.కోటి తీసుకొని దొంగ సర్వేలు
- కరెంటుపై మూర్ఖపు మాటలకు కాంగ్రెస్‌కు ఎవరైనా ఓటేస్తారా?
- కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం చరిత్రాత్మక అవసరం
- బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య

జనగామ, నవంబర్ 4 (నమస్తే తెలంగాణ) : తెలంగాణలో పూర్తిగా భ్రష్టుపట్టిపోయిన కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల తర్వాత భూస్థాపితం అవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులకు విద్యుత్ 24గంటలు సరఫరా చేస్తుంటే, 5గంటలు సరిపోతుందంటున్న పార్టీకి ఎవరైనా ఓటేస్తారా? అని ప్రశ్నించారు. శనివారం జనగామలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కర్నాటక డిప్యూటీ సీఎం శివకుమార్ తెలంగాణ ఎన్నికల ప్రచారంలో 3గంటల కరెంటు అని మూర్ఖంగా మాట్లాడి వెళ్లారని, అలాంటప్పుడు కాంగ్రెస్ నాయకులు ప్రజల వద్దకు ఏ ముఖం పెట్టుకొని ఓట్లకు వెళ్తారని ధ్వజమెత్తారు. రూ.కోటి పెట్టుబడి పెట్టి దొంగ సర్వేలు చేయించుకొని బీసీలు, ముస్లిం, మైనార్టీలకు దక్కాల్సిన సీట్లను అమ్ముకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నామరూపాల్లేకుండా అవుతుందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌లో బీసీలను అడుగడుగునా అవమానించడం తప్ప ఆ వర్గాలకు ఏ మాత్రం గౌరవం, గుర్తింపు లేదన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కావాలని అడిగినట్లే.. ఎన్నికల్లో అణగారిన వర్గాల ఓట్ల ద్వారా లబ్ధిపొందేందుకు ఇన్నేళ్లుగా లేని కులగణన అంశాన్ని అన్ని పార్టీలు లేవనెత్తుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు అనేక మంది చెబుతారు కానీ ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన కేవలం 3నెలల్లోనే సకల జనుల సర్వే చేయించిన ఘనుడు దేశంలో ఒకే ఒక్కడు అది కేసీఆర్ అని పొన్నాల అన్నారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలోనే రాష్ట్రంలో కులగణన చేపట్టిన కేసీఆర్‌లో తాను ఆరాటం.. తపన చూసానని.. తొమ్మిదిన్నరేండ్ల క్రితమే ఎన్నికల సమయం కాకున్నా ఎవరినీ ప్రభావితం చేయాల్సిన అవసరం లేకున్నా కులగణన తెచ్చి కేసీఆర్ బడుగు, బలహీనవర్గాల పక్షపాతిగా ఉన్నారని చెప్పారు. అందుకే తెలంగాణకు కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం చరిత్రాత్మక అవసరమని ప్రజలు భావిస్తున్నారని చెప్పారు. ఆయన నాయకత్వంలోనే ప్రజల చెంతకు పాలన.. ప్రజల వద్దకు డబ్బులు వెళుతాయని అన్నారు. తాను పదవులు, అధికారం కోసం బీఆర్ఎస్‌లోకి రాలేదని.. గౌరవం ఉండాలని.. బీసీలను గౌరవించే పార్టీల్లో ఉండాలనే గులాబీకండువా కప్పుకున్నట్లు వెల్లడించారు. గతంలోనే పీసీసీ అధ్యక్షుడిగా పనిచేసిన బీసీ వర్గానికి చెందిన ముగ్గురు కూడా కాంగ్రెస్‌కు రాజీనామా చేశారని తెలిపారు. అప్పుడు వాళ్లు.. ఇప్పుడు నేను ఎందుకు బయటకు వచ్చానని అధిష్ఠానం రాజకీయంగా ఏనాడైనా ఆలోచించిందా? బీసీ వర్గాలు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సహకరించారా? ఏవైనా లోపాలను గుర్తించి.. సమస్యను పరిష్కరించేందుకు చొరవ తీసుకున్నదా? బీసీలే ఎందుకు దూరమవుతున్నారో గుర్తించారా? అని పొన్నాల కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ప్రశ్నించారు. 1983 నుంచి గడిచిన 55ఏండ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్రలో తెలంగాణ ప్రాంతం నుంచి ఆ పార్టీకి ఏనాడూ 50 సీట్లు రాలేదని, ఇప్పుడున్న పరిస్థితుల్లో కాంగ్రెస్ పరిస్థితి మరింత దిగజారిందని పొన్నాల స్పష్టం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు బండ యాదగిరిరెడ్డి, ఆరిఫ్ తదితరులు ఉన్నారు.



సోలిపురంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంట్ కష్టాలు తప్పవు

**ఎంపీపీ జొన్నగోని హరిత, జడ్పీటీసీ ముద్దసాని పద్మజావెంకట్‌రెడ్డి**

తరిగొప్పుల, నవంబర్ 4 : కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే కరెంట్ కష్టాలు తప్పవని ఎంపీపీ జొన్నగోని హరిత సుదర్శన్‌గౌడ్, జడ్పీటీసీ ముద్దసాని పద్మజా వెంకట్‌రెడ్డి అన్నారు.. శనివారం మండలంలోని సోలిపురం, అబ్దుల్‌నాగారం, బొత్తలపర్రె గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని గుర్తించి కారు గుర్తుకు ఓటు వేసి పల్లా రాజేశ్వర్ రెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చెన్నూరి ప్రమీలాసంజీవ, సర్పంచులు అర్జుల రమా సంపత్‌రెడ్డి, దామెర ప్రభుదాస్, భుక్యా కమల, అమిరిశెట్టి వీరేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి, అధికార ప్రతినిధి చిలివేరు లింగం, బీఆర్ఎస్ మండల కోఆర్డినేటర్ జొన్నగోని కిష్టయ్యగౌడ్, మండల నాయకులు తాళ్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, అంకం రాజారాం, తాళ్లపల్లి పోచయ్యగౌడ్, వంగ రామరాజు, భూస యాదయ్య, సాయిల్ల రాజు, యూత్ అధ్యక్షుడు మాల్యాల సుధీర్ పాల్గొన్నారు.



వృద్ధురాలిని ఓటు వేయాలని అడుగుతున్న కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళారాజు

## 'పల్లా'ను భారీ మెజార్టీతో గెలిపించాలి

జనగామ రూరల్, నవంబర్ 4 : వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్ రెడ్డి గెలుపుకోసం కృషి చేయాలని 13వార్డు కౌన్సిలర్ మల్లిగారి చంద్రకళారాజు కోరారు. శనివారం 13వార్డులో పల్లా గెలుపుకోసం వార్డులో కార్యకర్తలతో కలిసి ప్రచారం నిర్వహించారు. పల్లాను అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బొట్ల శంకర్, పులిసాయి, పానుగంటి ప్రవీణ్, బబ్లూ, పృథ్వీ పాల్గొన్నారు.



కేటీఆర్‌తో మురళి, న్యాయవాదులు

## ఆత్మీయ సమ్మేళనానికి తరలిన న్యాయవాదులు

జనగామ రూరల్, నవంబర్ 4 : హైదరాబాద్‌లో జరిగిన న్యాయవాదుల ఆత్మీయ సమ్మేళనానికి జనగామ న్యాయవాదులు హాజరయ్యారు. సభకు విచ్చేసిన మంత్రి కేటీఆర్‌ను న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ కార్యవర్గ కన్వీనర్ పసునూరి మురళి, కో కన్వీనర్ చెరుకు చంద్రశేఖర్, సభ్యులు పానుగంటి శ్రీనివాస్, బండి కరుణాకర్, సృజన్, అమృతరావు, బండి మధు, ఆకుల శ్రీనివాస్, నేతి శ్రీమాన్, శ్రీను, ఉదయ్ పాల్గొన్నారు.

## ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

**కలెక్టర్ శివలింగయ్య**

బచ్చన్నపేట, నవంబర్ 4 : జనగామ జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నామని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య తెలిపారు. శనివారం మండల కేంద్రం గోపాల్‌నగర్ వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్‌పోస్టును ఆయన తనిఖీ చేశారు. అనంతరం పోచన్నపేట మండల ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పిల్లలకు అందిస్తున్న విద్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు. పలు సూచనలు చేశారు. అనంతరం పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. అన్ని సౌకర్యాలు సమకూర్చాలన్నారు. ఆయన వెంట ఎన్నికల నోడల్ అధికారి నరేందర్‌రెడ్డి, హెచ్‌ఎం అమృత, మేఘమాల పాల్గొన్నారు.




గోపాల్‌నగర్‌లో పోలీస్ చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న కలెక్టర్ శివలింగయ్య

## నేడు దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనం

నర్మెట, నవంబర్ 4 : జనగామ నియోజకవర్గంలో నేడు(ఆదివారం) ఉదయం 10గంటలకు బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించే దివ్యాంగుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని నవతెలంగాణ రాష్ట్ర దివ్యాంగుల ఫోరం జిల్లా కమిటీ అధ్యక్షుడు పంతులు ప్రభాకర్‌రావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాయరావు ఉపేందర్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింతకింది సురేశ్, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్‌తో కలిసి పత్రికా విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపుకోసం మనందరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. దివ్యాంగులకు సముచిత స్థానం కల్పించిన సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ వెంటనే తామం తా ఉంటామని చెప్పారు. ఈ సమావేశానికి దివ్యాంగుల సహకార సంస్థ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా గ్రాడ్యుయేట్ అధ్యక్షుడు పెరబోయిన శ్రీధర్, జిల్లా అధికార ప్రతినిధి కల్యాణం రాజు, నాయకులు కాసు కనకయ్య, గోపగోని సుధాకర్, జాటోత్ దేవ, రవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పంతులు ప్రభాకర్‌రావు

## 'టీకాలను సద్వినియోగం చేసుకోవాలి'



సిద్దెంకిలో గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యుడు శ్రీకాంత్

జనగామ రూరల్, నవంబర్ 4 : పారుడు రోగ నివారణ వ్యాధి నిరోధక టీకాలు(పీపీఆర్) టీకాలు ప్రతి జీవానికి వేయించాలని మండల పశువైద్యుడు శ్రీకాంత్ తెలిపారు. శనివారం మండలంలోని సిద్దెంకి గ్రామంలో గొర్రెలు, మేకలకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న టీకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా 860 గొర్రెలు, 74 మేకలకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది నజీర్, గొర్రెల మేకల పెంపకందారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ధర్నా

నర్మెట, నవంబర్ 4 : తమపై అనుచితంగా ప్రవర్తిస్తున్న హెచ్‌ఎం సారయ్యను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నర్మెట గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు నర్మెట ప్రధాన చౌరస్తాలో శనివారం ధర్నా నిర్వహించారు. రోడ్డుపై నిరసనలు, ధర్నాలకు అనుమతులు లేవని, సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని ఎస్సై శ్రీకాంత్‌యాదవ్ విద్యార్థినులకు సూచించడంతో పాఠశాలకు చేరుకొని గేట్ వద్ద సుమారు మూడు గంటలు మధ్యాహ్న భోజనం చేయకుండా నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న డీటీడీవో చంద్రకళ, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, ఎస్సై శ్రీకాంత్‌యాదవ్ పాఠశాలకు చేరుకొని విద్యార్థినులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమపై హెచ్‌ఎం సారయ్య ప్రవర్తన సరిగా లేదని, దుర్భాషలాడుతున్నారని డీటీడీవో చంద్రకళకు రాతపూర్వకమైన ఫిర్యాదు ఇచ్చారు. విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని మె హామీ ఇచ్చారు. వెంటనే సెలవుపై వెళ్లాలని హెచ్‌ఎం సారయ్యను డీటీడీవో ఆదేశించారు. హెచ్‌ఎం సారయ్యను వివరణ కోరగా సమయానుకూలంగా పాఠశాలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు వచ్చేలా తను పనిచేస్తున్నానని తెలిపారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు మద్దతుగా పాల్గొన్నారు.

## కనకరాజు మృతిపై సంతాపం



కనకరాజు (ఫైల్)

బచ్చన్నపేట, నవంబర్ 4 : మండలంలోని వివిధ గ్రామాల్లో వీఆర్వోగా విధులు నిర్వర్తించిన కనకరాజు అనారోగ్యంతో మృతి చెందడంపై ఆయా గ్రామాల ప్రజలు ప్రగాఢ సంతాపం ప్రకటించారు. రెవెన్యూ శాఖలో విధులు నిర్వర్తిస్తూ ఆయన అందరి మన్ననలు పొందారని పలువురు కొనియాడారు. ఆయన అకాల మృతి కుటుంబానికి తీరని లోటన్నారు. కనకరాజు ప్రస్తుతం తరిగొప్పుల ఎంపీడీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందడంతో పలువురు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు మాజీ వీఆర్వోలు నాగార్జున, రెహమాన్, యాదగిరి, ఆంజనేయులు, శంకర్, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.